# ఖరీఫ్‌కు సాగునీరు ఇవ్వలేం..




2లో..

-వర్షపాత లోటును రైతులకు వివరించండి
-శాఖల సమన్వయంతో ముందస్తు కార్యాచరణ
-ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
-మంత్రి తుమ్మలతో కలిసి ఎల్‌నినో ప్రభావంపై సమీక్ష

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 21 | జూలై | 2026 పేజీలు : 8

# ఏది ప్రత్యామ్నాయ పంట..!?



## -కరువు కోరల్లో సాగు
## -అడుగంటుతున్న భూగర్భ జలాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** నీటి ఆధారిత పంటలను సాగు చేయవద్దని, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని చెబుతున్నారు కానీ వరి స్థానంలో ఏ పంటలు సాగు చేయాలన్న దానిపై స్పష్టత ఇవ్వటం లేదు. సహకరించని ప్రకృతి, పాలకుల విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. దిగుబడులు పెరుగుతున్నా రైతులకు కష్టాలు, నష్టాలు తప్పటం లేదు. అతి వృష్టితో పంటలు దెబ్బతినటం లేకపోతే అనావృష్టి కారణంగా పంటలు ఎండిపోవటం జరుగుతుంది. దశాబ్ద కాలంగా వస్తున్న కొత్త రకం తెగుళ్లు ముఖ్యంగా మెట్ట పంటలకు వచ్చే తెగుళ్లతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్ని తెగుళ్ల విషయంలో క్రిమి సంహారక మందులు పిచికారి చేసినా తెగుళ్లు తగ్గకపోవటంతో చివరకు పంటలనే తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ఎలినినో ప్రభావంతో వర్షాలు కురవక నీటి ఆధారిత పంటల స్థానే వేరే పంటలు సాగు చేయాలంటే కేవలం అపరాల సాగు మాత్రమే కనిపిస్తుందని రైతులు అంటున్నారు. వరి సాగు చేస్తున్న భూముల్లో సగానికి పైగా తేలిక నేలలు , వంపులు, బాడవ నేలలు కావడంతో వరి తప్ప మరో పంట సాగు చేసే పరిస్థితి లేదు. కేవలం మిర్చి, పత్తి, మొక్కజొన్న మొదలగు పంటలు సాగు చేసే రైతులు అపరాల పంటలు సాగు చేసే అవకాశం ఉంది. కాలం కరుణించి ఆగస్టు మాసంలో వర్షాలు పడి ప్రాజెక్టులలోకి నీరు చేరితే

మిగతా 2లో..

### పది లక్షల ఎకరాల
## ఆయిల్‌పామ్ సాగు విస్తరణే లక్ష్యం





-కొణిజర్లను పారిశ్రామిక మండలంగా తీర్చి దిద్దుతాం
-దేశంలో తొలి సమీకృత ఆయిల్‌పామ్ కాంప్లెక్స్
-డిప్యూటి సిఎం భట్టి, మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతుల ఆదాయం పెరగాలంటే సాంప్రదాయ పంటలతోపాటు ఆదాయం వచ్చే వాణిజ్య పంటలసాగువైపు మొగ్గుచూపాలని ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మండల పరిదిలోని అంజనాపురంలో 113 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సమీకృత గోద్రెజ్ ఆయిల్‌పామ్ పరిశ్రమను డిప్యూటి సిఎం భట్టివిక్రమార్క రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్, గోద్రెస్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి గోద్రెజ్, గోద్రెజ్ చీఫ్ ఎగ్జిక్యూటి ఆఫీసర్ సునీల్ కటారియా, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్‌దత్‌లతో కలిసి సోమవారం ప్రారంబించారు. తొలుత పరిశ్రమలోనే ఉత్పత్తి విభాగాలు, ఆయిల్‌పామ్ గెలలు, ప్రాసెసింగ్ యూనిట్లు నాణ్యత, నియంత్రణ వ్యవస్థను పరిశీలించారు.

మిగతా 2లో..

# ఖద్దర్ కనుసన్నల్లో మట్టి దందా..!



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** జూలూరుపాడు మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పేరుతో సాకుతో ఖద్దర్ కనుసన్నలలో యదేచ్చగా మట్టి దోపిడీ సాగుతోంది. జూలూరుపాడు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ మట్టి దందా రోజురోజుకూ విస్తరిస్తూ ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న సంబంధిత శాఖల అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేని సీతారామ ప్రాజెక్టు కాలువ నుంచి భారీ ఎత్తున మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రాత్రింబవళ్లు తరలిస్తూ మట్టి మాఫియా లక్షల రూపాయలు ఆర్జిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ వ్యవహారాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న గ్రామస్తులను బెదిరింపులకు గురిచేస్తూ అంతు చూస్తాం అంటూ హెచ్చరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పోలీసులు హెచ్చరించినా ఆగని మట్టి రవాణా**
**జిల్లా కలెక్టర్ జోక్యం కోరుతూ విజ్ఞప్తి**

**ఖద్దరు కనుసన్నలలో యథేచ్ఛగా మట్టి దందా..**

గత కొంత కాలంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా మట్టి మాఫియా అక్రమ తవ్వకాలు కొనసాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. టిప్పర్ మట్టికి సుమారు రూ.4,500, ట్రాక్టర్ మట్టికి రూ.1000 చొప్పున వసూలు చేస్తూ రోజుకు వందలాది లోడ్లు తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. బడి, గుడి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మట్టి అవసరమనే పేరుతో అనుమతులకతీతంగా భారీగా మట్టిని

మిగతా 2లో..

# ఏది ప్రత్యామ్నాయ పంట..!?

**(మొదటిపేజీ తరువాయి)**
అప్పటి పరిస్థితులను బట్టి పంటలను సాగు చేసుకోవచ్చు. అన్ని రకాల భూముల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు సాధ్యంకాదు. పై నుంచి కింది దాకా వాతావరణానికి అనుగుణంగా పంటలు సాగు చేయండి అంటున్నారే కానీ ఏ పంటలు సాగు చేయాలి, విత్తనాల పరిస్థితి ఏమిటన్న దానిపై స్పష్టత లేదు. కేవలం ప్రత్యామ్నాయం అంటూనే నెల రోజులుగా కాలం వెల్లబుచ్చుతున్నారు.

**ప్రమాద ఘంటికలు...**
వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జులై మాసంలో 93 శాతం లోటు వర్షపాతం ఉందని వాతావరణ శాఖాధికారులు ప్రకటించిన విషయం అందరికీ విధితమే. కొన్ని చోట్ల వేసవి దుక్కులు దున్నిన భూములు మరో సాలు దున్నేందుకు వర్షం పడక దుక్కులుగానే మిగిలిపోయాయి. వేసవిని మరిపించే రీతిలో వస్తున్న ఎండలకు అక్కడక్కడ వేసిన పైర్లు వాడి ఎండిపోతున్నాయి. మధ్యతరహా ప్రాజెక్టులుమినహాయిస్తే చెరువులు, కుంటలు, వాగుల్లో నీటి చెమ్మకూడా కనిపించడం లేదు. వేసవి ప్రారంభంలో కాస్త నీరు ఉన్న చెరువులు సైతం ఇప్పుడు పూర్తిగా అడుగంటాయి. అన్నింటికి మించి రోజు రోజుకు పడిపోతున్న భూ గర్భ జల నీటిమట్టం భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలు మోగిస్తుంది. సాగు నీటి సమస్యతో పాటు భవిష్యత్తులో తాగునీరు సమస్య కూడా తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటి వరకు చినుకులతో కూడిన చిరుజల్లులు తప్ప భారీ వర్షపాతం నమోదు కాలేదు. వర్షాభావ పరిస్థితులు కేవలం వ్యవసాయ రంగంపైనే కాకుండా అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కరువైన వ్యవసాయ కూలీలు, చిన్న సన్నకారు రైతుల పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ఒకప్పుడు కరువు వస్తే బతుకు దెరువు కోసం పట్టణాలకు వలస వచ్చేవారు. పెరిగిన యాంత్రీకరణతో పాటు భవన నిర్మాణ రంగం ఉపాధి కల్పించే ఇతర మార్గాలు సైతం సంక్షోభంలో కూరుకుపోయాయి. పట్టణాల్లోనూ ఉపాధి లభించే అవకాశం లేదు.కరువు వ్యాపార, వాణిజ్య రంగాలపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. కార్పొరేట్ సంస్థలు తప్ప చిరు వ్యాపారులు సాంప్రదాయ వ్యాపారాలు కొనసాగించే వారిపైన కరువు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు మరింత అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. కరువు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు ఉపాధి మార్గాల పైన దృష్టిసారించాల్సి ఉంది. గత నెల రోజులుగా ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యామ్నాయం ప్రత్యామ్నాయం అంటూ తిరుగుతున్నారు తప్ప మరో ఆలోచన చేయకపోవడం శోచనీయం.

# ఖరీఫ్‌కు సాగునీరు ఇవ్వలేం..

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఈ ఏడాది నాగార్జున సాగర్ , పాలేరుతో పాటు ఇతర ప్రాజెక్టుల నుంచి సాగునీరు ఇవ్వలేమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులు, వర్షపాత లోటును రైతులకు వివరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టితో కలిసి సమీక్ష నిర్వహించారు. పెద్దపల్లికి చెందిన శాస్త్రవేత్త డా॥ సంపత్ ఎల్‌నినో ప్రభావ పరిస్థితులను వివరించారు. జులై 15 నాటికి ఖమ్మంజిల్లాలో 35 శాతం వర్షపాత లోటు నమోదైందని భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ వాస్తవ పరిస్థితులను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రైతుకు వర్షపాత ప్రస్తుత పరిస్థితులపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నిరంతరం భూగర్భ జలాలు నీటి వనరుల లభ్యత వాతావరణ పరిస్థితులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనివ్వాలని ఎక్కడైనా తాగునీటి వనరుల్లో ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. భూగర్భ జలాల లభ్యత ఆధారంగానే పంటలు సాగు చేయాలని పెసర, మినుము, కందులు, అలసంద, చిరు ధాన్యాల వంటి పంటలు సాగు చేస్తే మేలు జరుగుతుందన్నారు. ఇప్పుడున్న సమాచారం మేరకు ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో కూడా వర్షపాతం ఉండే అవకాశం లేనందున భూ గర్భ జలాల పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. 150 ఏళ్లకు ఒకసారి వచ్చే కరువు పరిస్థితి ఈ ఏడాది నెలకొందన్నారు. జల విద్యుత్ ఉత్పత్తి కూడా తగ్గుతుందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను ఎలా వినియోగించాలనే అంశంపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కలెక్టర్ అంకిత్, శాసన సభ్యులు రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావు, సిపి సునీల్ దత్, కొత్తగూడెం ఎస్‌పి రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, సుడా ఛైర్మన్ దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పది లక్షల ఎకరాల ఆయిల్‌పామ్ సాగు విస్తరణే లక్ష్యం



**(మొదటిపేజీ తరువాయి)**
ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు 199192 లోనే అప్పటి ముఖ్యమంత్రి నెదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలోనే ఈప్రాంతం ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. జిల్లా విభజన తర్వాత ప్రస్తుత ఖమ్మం జిల్లా పూర్తిగా వ్యవసాయం పైనే ఆధారపడుతోందని అన్నారు. నాగార్జునసాగర్ ఎడమకాలువ, పాలేరు రిజర్వాయర్, వైరా రిజర్వాయర్ ఈ ప్రాంతా రైతాంగానికి జీవనాధారమని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో మాత్రమే ఆయిల్ పామ్ సాగు జరుగుతుందని, దేశ అవసరాలకు సుమారు 70 ఎకరాల సాగు అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని రానున్న రెండు, మూడేళ్లలో 10 లక్షల ఎకరాలకు సాగు పెంచడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. రైతులకు నాలుగు సంవత్సరాల కాలంలో ఎకరాకు సుమారు రూ 52 వేల ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. సమీకృత పరిశ్రమ ఏర్పాటు వలన యువతకు వరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల ఆర్థికోత్పత్తి (జిఎస్‌డిపి) సుమారు 17 లక్షల కోట్లు ఉండగా వ్యవసాయ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉండటం రైతుల ఆర్థిక పరిస్థితిని సూచిస్తోందని అన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే వాణిజ్య పంటల విలువ ఆధారిత పరిశ్రమలే శాశ్వత పరిష్కారమని స్పష్టం చేశారు. ఇటీవల 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో 9 వేల కోట్ల పెట్టుబడి సాయం జమచేశామని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం కాలువలద్వారా లభించే నీటిని వినియోగించుకొని జిల్లాలో ఉద్యానవన పంటలు సాగును మరింత విస్తరింపచేయాలని అన్నారు. కొణిజర్ల మండలాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పారిశ్రామిక మండలంగా తీర్చిదిద్దుతామని అన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతు దేశంలోనే ఆయిల్‌పామ్ హబ్‌గా తెలంగాణాను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. దేశంలో ఇప్పటివరకు సీడ్‌గార్డెన్ లేకపోవడంతో ఆయిల్‌పామ్ విత్తనాలకోసం ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలపై ఆధారపడాల్సి వస్తోందని అన్నారు. గోద్రెజ్ సంస్థ మలేషియా భాగస్వామ్యంతో దేశంలో ఖమ్మంలోనే తొలి ఆధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేస్తోందని తెలిపారు. సీడ్ గార్డెన్‌తో పాటు పరిశోధనాకేంద్రం, రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శనా కేంద్రం, రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శన విభాగాలు, శిక్షణా కార్యక్రమాలు, నాణ్యమైన నర్సరీల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు నేటినుంచే శ్రీకారం చుడుతున్నామని వివరించారు. ఈ సమీకృత ఆయిల్‌పామ్ కేంద్రం రైతులకు అన్ని విధాల ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితిల్లో కూడా పంట దిగుబడి కొంచెం తగ్గొచ్చుగాని రైతులకు మాత్రం ఏమాత్రం నష్టం చేకూరదని తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల్లో కంది, పత్తి, పప్పు ధాన్యాల వంటి అంతర పంటలు సాగునుచేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్, అంజనాపురం సర్పంచ్ అంబడిపూడి కమలమ్మ, గద్దలగూడెం సర్పంచ్ భూక్యా సునీత, గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ నాదిర్ బి గోద్రెజ్, గోద్రెజ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్, బాషా, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ యరగర్ల హనుమంతురావు, వైరా వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మన్ బోళ్ల గంగారావు, కొణిజర్ల మండల తహాశీల్దార్ అరుణ కుమారి, ముదిగొండ తహాశీల్దార్ దొడ్డారపు సైదులు, ఆర్ఐ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఖద్దర్ కనుసన్నల్లో మట్టి దందా..!



**(మొదటిపేజీ తరువాయి)** తరలిస్తున్నారని, ఈ పేరును అడ్డుపెట్టుకుని అక్రమ వ్యాపారం కొనసాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**అధికారుల మధ్య బాధ్యతల నిర్లక్ష్యం..**
అక్రమ మట్టి తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇది మా పరిధి కాదు అంటూ ఒక శాఖ పై మరో శాఖ బాధ్యత నెట్టివేస్తోందని, చర్యలు తీసుకోవడంలో మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే మట్టి మాఫియా మరింత రెచ్చిపోతోందని, ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉందో విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**పోలీసులు హెచ్చరించినా తగ్గని దందా..**
స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు హెచ్చరికలు చేసినప్పటికీ అక్రమ మట్టి రవాణా మాత్రం ఏమాత్రం తగ్గలేదని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసులు ట్రాక్టర్లను సీజ్ చేసి నిలిపి వేసినప్పటికీ కొద్దిరోజులు ఆగిన మట్టి దందా తిరిగి మళ్లీ ప్రారంభమైంది. రాత్రి వేళల్లో అధిక సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లు మట్టిని తరలిస్తూ యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారని, చట్టాన్ని సవాల్ చేసే విధంగా మాఫియా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు.

**దుమ్ము, ప్రమాదాలతో ప్రజలకు ఇబ్బందులు..**
మట్టి రవాణా కారణంగా గ్రామ రహదారులపై దుమ్ము ధూళి విపరీతంగా ఎగిసిపడుతూ ఇళ్లలోకి చేరుతోందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. అదే విధంగా వేగంగా వెళ్తున్న టిప్పర్లు, ట్రాక్టర్ల కారణంగా ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగినా అధికారులు స్పందించకపోవడం విచారకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లా కలెక్టర్ జోక్యం కోరుతూ విజ్ఞప్తి..**
జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని అక్రమ తవ్వకాలను అరికట్టాలని, మైనింగ్, రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మట్టి మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రకృతి సంపదను కొల్లగొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ మట్టి దందాను వెంటనే అరికట్టాలని, బాధ్యులపై కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు సన్మానం



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు విజ్ఞాన్ స్కూల్ నందు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లి దండ్రులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ ఉయ్యూరి శ్రీవ్యాల్ మాట్లాడుతూ ప్రతీ తల్లిదండ్రులు ప్రస్తుతం వారి యొక్క పిల్లలను పెద్ద పెద్ద చదువులు చదివించదానికి కష్టాన్ని కూడా లెక్కచేయకుండా ఆస్తులు కంటే పిల్లలు చదువులే ముఖ్యం అని భావించిన తల్లి దండ్రులు వారి జీవితాన్ని కావ్వొత్తి లాగా కరిగిపోతు త్యాగం చేస్తున్నారు అన్నారు. కనుక ఎన్ని జన్మలెత్తిన వారి ఋణం తీర్చలేము, కనుక వారి కష్టాన్ని వమ్ము చేయకుండా దీపం వెలుగు కారుచీకట్లను తొలగించే వెలుగుగా మారాలని, మంచి ఉద్యోగాల్లో సెటిల్ అయ్యి మీ తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని విద్యార్థులకు తెలుపుతూ ఇదే మా స్ఫూర్తి ఫౌండేషన్ కు ఇచ్చే పెద్ద రిటర్న్ గిఫ్ట్ అని తెలిపారు. అంతేకాకుండా రానున్న కాలంలో మన రాష్ట్రాల్లో ఎన్‌జీఓ స్ వారి యొక్క అవసరం లేకుండా సొంతంగా చదివించుకునే పరిస్థితులు, అభివృద్ధి ఉండాలని వారి అవసరం ఉండకుండా ఉండాలని కోరుకుంటున్నాను అని తెలుపుతూ, సభకు హాజరైన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్, ఏఎంఇ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, స్థానిక అంబేద్కర్ నగర్ జిల్లా అధికారులు జినుగు మరియన్న జిల్లా హార్టికల్చర్ అధికారి మాహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా డిపిఆర్ఓ శీలం శ్రీనివాసరావు, విజ్ఞాన్ స్కూల్ కరెస్పాండంట్ షేక్ ఇస్మాయిల్, కల్లూరు మున్సిపాలిటీ 16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, రిటైర్డ్ లెక్చరర్ ఉబ్బన నాగరాజు, స్ఫూర్తి ఫౌండేషన్ లబ్ధిదారులు, తల్లిదండ్రులు, విద్యార్థులు స్ఫూర్తి కమిటీ సభ్యులు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, చింతలపూడి కృష్ణ, ఉబ్బన వేణుబాబు, షేక్ ముజీమ్, మద్దెల వెంకటేశ్వరావు, ఇందూరి దేవేందర్, దామల దయాకర్ పాల్గొన్నారు.

# సిరిగుండం గిరిజన గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయండి





**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:**
దుమ్ముగూడెం మండలం నారాయణరావుపేట గ్రామ పంచాయితీ పరిధిలోని సిరిగుండం గిరిజన గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావు, సీడీపీవో విజయకు వినతిపత్రం సమర్పించారు. నారాయణరావు పేట సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ సేవలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే కేంద్రాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు మడకం నంద, సవలం, పుల్లయ్య, ఉయిక చోటు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా క్యాచ్‌అప్ డ్రైవ్

**తట్టు, రూబెల్లా నిర్మూలనకు**
**రెండో విడత ప్రత్యేక టీకా కార్యక్రమం ప్రారంభం**
**-మిస్సైన పిల్లలు, గర్భిణులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి**
**-డిఎంహెచ్ఓ డాక్టర్ డి రామారావు**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** తట్టు, రూబెల్లా(ఎంఆర్) వ్యాధులను పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ఖమ్మం జిల్లాలో రెండో విడత ప్రత్యేక క్యాచ్ అప్ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను సోమవారం ప్రారంభించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. జూలై 20 నుంచి 27 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా 210 వ్యాక్సినేషన్ సెషన్లను విజయవంతంగా నిర్వహించి, లక్ష్యంగా ఉన్న 443 మంది పిల్లల్లో 431 మందికి(97.3)శాతం టీకాలు అందించినట్లు తెలిపారు. ఎంఆర్ 1, ఎంఆర్ 2 తోపాటు బిసీజీ, పెంటావాలెంట్, డీపీటీ టీకాలు కూడా అందించగా, లక్ష్యంగా ఉన్న 86 మంది గర్భిణీలకు శాతం 100 టిడీ టీకాలు వేసినట్లు వెల్లడించారు. రెండో విడతలో గతంలో టీకాలు మిస్ అయిన లేదా మధ్యలో ఆపేసిన పిల్లలు, గర్భిణీలను గుర్తించేందుకు ఇంటింటీ సర్వే చేపట్టాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. వలస కార్మికులు, సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక మైక్రో యాక్షన్ ప్లాన్ అమలు చేసి వంద శాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. అర్హులైన పిల్లల తల్లిదండ్రులు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లను సంప్రదించి రెండో విడత ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఎంహెచ్ఓ డాక్టర్ డి రామారావు విజ్ఞప్తి చేశారు.

# దేవాలయాల్లో చోరీకి పాల్పడ్డ ముగ్గురు దొంగల అరెస్ట్



**-24 గ్రాములు బంగారం, కేజిన్నర వెండి, నేరాలకు ఉపయోగించిన కారు, మోటార్ సైకిల్ స్వాధీనం**
**-నేరస్థులపై పీడీ యాక్ట్ నమోదు**
**-విలేకరుల సమావేశంలో ఏసీపీ వసుంధర యాదవ్ వెల్లడి**

**ప్రజాపక్షం/పెనుబల్లి:** దేవాలయాల్లోని దేవుళ్ళ విగ్రహాల పై ఉన్న వెండి బంగారాన్ని లక్ష్యంగా దోచుకునే ముగ్గురు దొంగల ను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ కు పంపిస్తున్నట్లు సోమవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం... తల్లాడ మండలానికి చెందిన షేక్ జానీ, ఆంధ్రప్రదేశ్ ఎటపాక మండలానికి చెందిన పేరాల నరసింహారావు, కొత్తగూడెం గౌతమ్ పూర్ కాలనీకి చెందిన అరవ ఉదయ్ కుమార్ అనే వ్యక్తులు దేవాలయాల్లో చోరీలకు పాల్పడేందుకు ముఠాగా ఏర్పడి పెనుబల్లి, తల్లాడ, వేంసూరు, కల్లూరు, కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గోకవరం గ్రామాల్లో వివిధ ఆలయాల్లో ఏడు చోట్ల చోరీకి పాల్పడి 24 గ్రాముల బంగారం 1.536 గ్రాముల వెండి దోచుకున్నారన్నారు. ఈ ప్రాంతాల్లో దొంగతనానికి పాల్పడేందుకు ఒక కారును మోటార్ సైకిల్ ని దొంగతనంగా కొట్టేసి రవాణా కోసం వాడారు అన్నారు. ఆ రెండు వాహనాలను కూడా సీజ్ చేశామని తెలిపారు. దేవాలయాల్లో దొంగతనానికి పాల్పడిన సొత్తును రికవరీ చేయడం జరిగిందన్నారు. వీరంతా పాత నేరస్తులేనని వీరిపై డేకాయేట్, ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన కేసులు కూడా హైదరాబాద్ ఎల్బీనగర్, గోకవరం, నేలకొండపల్లి, ములకలపల్లి పోలీస్ స్టేషన్లో వీరిపై కేసులు నమోదై ఉన్నాయన్నారు. తరచూ దొంగతనానికి పాల్పడుతున్న వీరు ముగ్గురిపై పీడి యాక్ట్ నమోదు చేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామని ఏసిపి తెలిపారు. ఈ దొంగల్ని ఆచూకీ కనిపెట్టడంలో పట్టుకోవడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బంది కి నగదు రివార్డు లు అందజేశారు.

**రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు...**

దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు బీటీ రహదారిపై సంచరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసిపి తెలిపారు. దమ్ము చక్రాలపై బీటీ రోడ్లపై సంచరిస్తున్న 10 ట్రాక్టర్లకు పైగా కేసు నమోదు అయ్యాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ ముత్తి లింగయ్య, పెనుబల్లి ఎస్ఐ వెంకటేష్, కల్లూరు ఎస్సై హరిత, సిబ్బంది పి. నాగేందర్, వెంకటేశ్వరరావు నరసింహారావు, ఎస్.కె మజీద్ పాష, రాజమల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# దళితుల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గం



**- 27 కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి**
**-డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యంగల ఆనందరావు**

**ప్రజాపక్షం/బోనకల్:** దళితులకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యంగల ఆనందరావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని కాకాటి కరుణాకర్ నివాసంలో నిర్వహించిన డిహెచ్‌పిఎస్ మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం దళితులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోకపోవడం విచారకరమని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో దళిత వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించారు. దళితులకు కేటాయించిన భూములను ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుని అసలు హక్కుదారులకు అప్పగించాలని, రెండెకరాల భూమి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, స్వయం ఉపాధిని ప్రోత్సహించేలా ఇండస్ట్రియల్ రుణాలను సబ్సిడీతో మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జూలై 27న ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో దళితులు, యువత, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ మండల కన్వీనర్ కాకాటి కరుణాకర్, నాయకులు మాతంగి రామ్‌కిరణ్, యువజన సంఘం నాయకులు కోసూరి అభి, రాజేష్ పాల్గొన్నారు.

# మధిర మండలంలో ట్రైల్ రన్‌గా సిఎం బ్రేక్ ఫాస్ట్

**ప్రజాపక్షం/మధిర :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సిఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా మధిర మండలంలోని అన్ని పాఠశాలకు సిఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ఇస్కాన్ టెంపుల్ వారి హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ సుమారుగా మధిర మండలంలోని 53 ప్రభుత్వ విద్యాసంస్థలకు సోమవారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ విద్యాసంస్థల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్‌ను అందించారు.



# వెంకటేశ్వర్లును అభినందించిన పొంగులేటి



**ప్రజాపక్షం/తల్లాడ:** టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా నియమితులైన నారపోగు వెంకటేశ్వర్లును రాష్ట్ర రెవెన్యూశాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఈ మేరకు నారపోగు వెంకటేశ్వర్లు సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి రాష్ట్రంలో పదవికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని, భవిష్యత్‌లో ఉన్నత పదవులును అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటికి వెంకటేశ్వర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# బీఎల్ఓ, బీఎల్‌ఏల సమన్వయ సమావేశం



**ప్రజాపక్షం/తల్లాడ:** పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠాలలో సోమవారం బీఎల్ఓ, బీఎల్‌ఏల సమన్వయ సమావేశంలో నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల అంశాలపై సమగ్రంగా చర్చించారు. రానున్న'సర్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కావల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసే విధానం, ప్రజలకు అవగాహన కల్పించడం, అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేట్లు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో బీఎల్ఓ సత్యవతి, బీఎల్‌ఏలు షేక్ జమాల్, తమ్మిశెట్టి శ్రీను, పెరికి కిరణ్ పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమర్ధవంతంగా తమ పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశారు.

# పంట రుణాల రెన్యువల్‌కు బ్యాంకర్ల కొత్త నిబంధనలు అన్యాయం



**ప్రజాపక్షం/బోనకల్:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో, బ్యాంకుల పంట రుణాల రెన్యువల్‌కు కొత్త నిబంధనలు విధించడం అన్యాయమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకెఎస్) మండల అధ్యక్ష, కార్యదర్శులు కొంగర భాస్కరరావు, ఏలూరి పూర్ణచంద్రరావులు అన్నారు. సోమవారం మండలంలోని తూము ప్రకాశరావు భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇతర బ్యాంకుల్లో ఉన్న అసలు రుణాలను పూర్తిగా చెల్లిస్తేనే పంట రుణాలను పునరుద్దరిస్తామని బ్యాంకులు షరతులు విధిస్తున్నాయని ఆరోపించారు. గతంలో వడ్డీ చెల్లిస్తే రుణాలను రెన్యువల్ చేసేవారని, ఇప్పుడు కొత్త నిబంధనలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గతంలో మాదిరిగానే పంట రుణాలను వెంటనే రెన్యువల్ చేయాలని, ప్రభుత్వం, బ్యాంకుల ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# సమగ్ర ఓటరు జాబితా సవరణ సర్వే ముగింపు



**ప్రజాపక్షం/ముదిగొండ:** సమగ్ర ఓటరు జాబితా సవరణ(సర్) ప్రక్రియలో భాగంగా మండలంలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో గత ఐదు రోజులుగా ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్ల కోసం ఇంటింటి సర్వే నిర్వహించి పూర్తి చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఎస్ఐఆర్ ముగింపు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్యూమరేషన్ ఫారం అందని ప్రతీ అర్హులైన ఓటర్లకు ఫారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేసేందుకు గ్రామస్తులు పూర్తి సహకారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సమన్వయ కమిటీ సభ్యుడు, మాజీ మండల కార్యదర్శి గడ్డం వెంకట్‌గౌడ్, గ్రామ సర్పంచి, ఉప సర్పంచులు సలీమా ఖాసీం బాబు, పెద్ద పొంగు రమాదేవి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ బీఎల్‌ఏ నజీర్ మహమద్, వార్డు సభ్యులు నక్కని కోటయ్య, ఉపేందర్, గ్రామ బీఆర్ఎస్ నాయకులు గడ్డం కుమారస్వామి, బి.బాలయ్య, పి.పురుషోత్తం నాయుడు, ఎస్.రామారావు, పీ.శ్రీను, ఎస్.కే. నభీ సాహెబ్, ఎం.భద్రయ్య, బీఎల్‌ఏ సహాయకులు అల్లాడి ప్రసాద్, ఎస్.కే. సలీం, ఎం.గణేశ్, కె.అమరావతి తదితరులు హాజరయ్యారు.

# మధిరలో మహాత్మాగాంధీ శాంతి సేన మానవహారం



**ప్రజాపక్షం/మధిర :** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద లడక్ సామాజిక కార్యకర్త, విద్యా వేత్త సోనమ్ వాంగ్చుంగ్ చేపట్టిన నిరహార దీక్ష ను బలవంతంగా విరమింపజేయడాన్ని ఖండి స్తూ పార్లమెంటు సమావేశబూల్లో కాక్రోచ్ జన తా పార్టీ ప్రస్తావించిన అంశాలపై సమగ్ర చర్చలు జరగాలని కోరుతూ మధిర పట్టణంలో మహాత్మాగాంధి శాంతి సేన ఆధ్వర్యంలో విద్యార్ధులతో కలిసి సమాచారం నిర్వహించారు. ఈ కార్యక్రమం మధిర పట్టణంలోని గౌట్ జూనియర్ కాలేజి సమీపంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా మాట్లాడిన గాంధి శాంతి సేన ప్రతినిధులు, విద్యార్ధుల సమస్యలు, నీట్ పరీక్షలపై వ్యక్తమవుతున్న ఆందోళనలు, విద్యా వ్యవస్థలో పారదర్శకత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు విద్యా రంగంలో నమ్మకం, పారదర్శకత పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకొని ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధి శాంతిసేన సభ్యులు మొగిలి శ్రీను, బొక్క పుష్పరావు, రావూరి వాసు, కోనేటి సతీష్, అనిల్‌కుమార్, పవన్, పండు, స్థానిక విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

## నాకు న్యాయం చెయ్యండి



**ప్రజాపక్షం/మణుగూరు:** ఏటూరు నాగారం చిన్నబోయిన గ్రామంలో డిసెంబర్ 8 న మణుగూరు చెందిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, రోడ్డు ప్రక్కనే ఉన్న సైదులు అని ఇంట్లోకి బస్సు దూసుకెళ్లింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే ఆ ఇల్లు మొత్తం కుప్పగా కూలిపోయింది. ఆ సమయంలో ఆర్టీసీ సిబ్బంది నిలదీయగా నష్ట పరిహారం చెల్లిస్తామని డ్రైవర్ ఒప్పుకున్నాడు. కానీ నేటివరకు సైదులుకు ఎటువంటి ఇళ్ళు నష్టపరిహారం చెల్లించలేదు. ఆర్టీసీ అధికారుల దగ్గరికి పోతే వెళితే మాకేం సంబంధం అంటూ చేతులు దులుపు కున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో కేసులు కూడా నమోదు అయ్యాయి. ఈ విషయంపై జిల్లా సీఎంఓ ఆఫీస్ కి వెళ్లి కలవడం తో స్థానిక అధికారులకు ఈ సంఘటనపై విచారించమని ఆదేశించారు. కానీ నేటివరకు కార్యాలయాల చుట్టూ తిరగడమే జరుగుతుంది అని నష్ట పరిహారం చెల్లించలేదని బాధితుడు సైదులు ఆవేదన వ్యక్తపరిచాడు. నాకు న్యాయం చేయాలంటూ మీడియాని సంప్రదించాడు.

## ఆదివాసి మహిళా రైతుపై దాడులు చేయడం సరికాదు



**ప్రజాపక్షం/మణుగూరు:** అశ్వాపురం మండలం మనుబోతులపాడు ఆదివాసి రైతులపై అటవీ శాఖ అధికారులు చేసిన దాడి దుర్మార్గమని భారత మహిళ సమాఖ్య భద్రాద్రి జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి అన్నారు. గిరిజన మహిళలపై పురుష అధికారులు చేయి చేసుకోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. తిరిగి ఆదివాసి రైతుల పైనే కేసులు నమోదు చేయడం వీరి అసమర్థ కు నిదర్శనం అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన పోడు హక్కుల హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలు సాగు చేస్తున్న సమయంలో వాటిని ధ్వంసం చేసి, ఆపై మహిళలని కూడా చూడకుండా కొట్టడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి చర్యలను మానుకోవాలని ఇతవు పలికారు.

## గ్లోబల్ రెయిన్బో విద్యార్థి వినూత్న ఆవిష్కరణ

**రూ 800తో పొడవు కొలిచే డిజిటల్ పరికరం రూపొందించిన 9వ తరగతి విద్యార్థి**



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఖమ్మం జిల్లా కూసుమంచిలోని గ్లోబల్ రెయిన్బో పాఠశాల 9వ తరగతి విద్యార్థి పి యశ్వంత్ సెన్సార్ సాంకేతిక ఆధారంగా పొడవును కొలిచే వినూత్న డిజిటల్ పరికరాన్ని రూపొందించి ప్రతిభ చాటాడు. ఈ పరికరం ద్వారా వస్తువులు, ప్రదేశాల పొడవును గరిష్టంగా 5 మీటర్ల వరకు వేగంగా, కచ్చితంగా కొలిచి డిజిటల్ డిస్ప్లేపై చూపించవచ్చు. కేవలం రూ 800 వ్యయంతో ఈ పరికరాన్ని రూపొందించడం విశేషం. విద్యార్థి ఆవిష్కరణను పాఠశాల కరస్పాండెంట్ ఎండీ ఏర్షాద్ అహ్మద్ అభినందిస్తూ, చిన్న వయసులోనే శాస్త్రీయ ఆలోచనతో చేసిన ఈ ప్రయోగం ఆదర్శనీయమన్నారు. విద్యార్థుల్లో పరిశోధన దృక్పథాన్ని పెంపొందించేందుకు పాఠశాల ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని వినూత్న ఆవిష్కరణలు చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యశ్వంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## డీసీసీబీ శాఖ మేనేజర్ స్రవంతికి ప్రతిభా పురస్కారం

**-అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా అవార్డు**



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిర్వహించిన శాఖ మేనేజర్ల సమీక్ష సమావేశంలో కూసుమంచి డీసీసీబీ శాఖ మేనేజర్ మల్లెల స్రవంతి అత్యుత్తమ పనితీరును గుర్తింపుగా అవార్డు అందుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో శాఖ సాధించిన వ్యాపార వృద్ధి, గోల్డ్ లోన్ల మంజూరు, రికవరీలు, ఖాతాదారులకు అందించిన మెరుగైన సేవలను పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారం ప్రదానం చేశారు. కూసుమంచి శాఖకు ఈ గౌరవం దక్కడం పట్ల బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు హర్షం వ్యక్తం చేయగా, స్రవంతి విజయం ఇతర శాఖల అధికారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

## ములకలపల్లిలో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

**-పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలని కాంగ్రెస్ నేతల సూచన**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఖమ్మం పార్లమెంట్ కోఆర్డినేటర్ నల్లపు దుర్గాప్రసాద్, అశ్వారావుపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ తుమ్మ రాంబాబు, మండల కోఆర్డినేటర్ సురభి రాజేష్ పరిశీలించారు. ఈసందర్భంగా ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యండి జహీరుద్దీన్, జిల్లా నాయకులు పేటేటి నర్సింహారావు, పాలకుర్తి రత్నభూషణం, కొప్పుల రాంబాబు, శనగపాటి రవి, మడకం రవితో పాటు పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో కోరలు..సన్నగిల్లుతున్న ఆశలు..!

**-జూలైలో ఏకంగా 93 శాతం లోటు వర్షపాతం**
**-లేత మొలకలపై ఎండదెబ్బ**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అన్నం పెట్టే అన్నదాత గుండె రగులుతోంది. ఆకాశం ముఖం చాటేయడంతో నేలకొండపల్లి రైతాంగం కన్నీటి పర్యంతమవుతోంది. వాతావరణ నిపుణులు ముందే హెచ్చరించిన ఎల్ నినో శాపం, ఇప్పుడు మండల రైతుల పాలిట యమపాశంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశంలో నల్లని మేఘాలు కమ్ముకొస్తున్నా, నేలపై ఒక్క చినుకు పడటం లేదు. అంతలోనే పొడి గాలులు వీచి ఆ మేఘాలను సైతం ఆవిరి చేస్తున్నాయి. వాతావరణంలో తేమ శాతం తగ్గిపోవడంతో మేఘాలు వర్షంగా మారడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా చుక్క వాన లేకపోవడంతో వ్యవసాయ పనులు ఎక్కడికక్కడే స్తంభించిపోయాయి. ముంచుకొస్తున్న కరువు రక్కసిని చూసి చేతులు కాలక ముందే ప్రభుత్వం స్పందించకపోతే, ఈ ఏడాది అన్నదాతల బతుకులు అగాధంలోకి పడిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

### ఘోరమైన లోటు..

జూలై నెలలో సాధారణంగా కురవాల్సిన 100.3 మిల్లీమీటర్లకు గాను కేవలం 7.3 మిల్లీమీటర్ల అత్యల్ప వర్షపాతమే నమోదైంది. ఏకంగా 93 శాతం లోటుతో మండలం మొత్తం వర్షపు నీటి కోసం అల్లాడుతోంది.

### మొలక దశలోనే ఎండిపోతున్న పంటలు

తొలకరి జల్లులను నమ్ముకుని మండలంలోని పలు రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 6 వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా.. మిరప, వరి, మొక్కజొన్న పంటలు కూడా భారీగానే వేశారు. అయితే ఆశించిన వానలు లేక విత్తనాలు సక్రమంగా మొలకెత్తలేదు. ఎర్రదుబ్బ భూములు పదును లేక బెట్టబారిపోతున్నాయి. తడి పొడి వానలకు అక్కడక్కడా మొలకెత్తిన లేత పైర్లు సైతం తీవ్రమైన ఎండలు, వడగాల్పులకు తట్టుకోలేక కళ్లముందే వాడిపోతున్నాయి. పత్తి మొక్కలు ఎదుగుదల లేక గిడసబారిపోతుండగా, మిరపలో ఆకులు ముడుచుకుపోతున్నాయి.

### పెట్టుబడులపై నీళ్లు కాదు... ఎండలే..!

విత్తనాలు, ఎరువులు, దుక్కి దున్నడం, కూలీల ఖర్చులతో ఇప్పటికే రైతులు ఎకరాకు వేలాది రూపాయల భారీ పెట్టుబడులు పెట్టారు. యుద్ధం కారణంగా కాంప్లెక్స్ ఎరువుల ధరలు మరింత పెరుగుతాయనే భయంతో, రైతులు నెల రోజుల క్రితమే బస్తాపై రూ. 450 అదనంగా పెట్టి కొనుగోలు చేసి ఇళ్లలో స్టాక్ పెట్టుకున్నారు. యాప్ ద్వారా యూరియా పొందేందుకు అష్టకష్టాలు పడ్డారు. తీరా చూస్తే వర్షాలు కురవకపోవడంతో పెట్టిన పెట్టుబడులన్నీ మట్టిపాలయ్యే పరిస్థితి వచ్చింది. పరిస్థితులు ఇలాగే ఉంటే పెట్టుబడి అంతా తుడిచిపెట్టుకు



పోయి, మళ్లీ అప్పులు తెచ్చి రెండోసారి విత్తనాలు వేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అడుగంటుతున్న భూగర్భ జలాలు

వరి సాగుపై నీలినీడలు తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలోని చెరువులు, కుంటల్లో చారెడు నీరు కూడా చేరలేదు. భూగర్భ జలాలు రోజురోజుకూ పాతాళానికి పడిపోతున్నాయి. మండలంలోని రెవెన్యూ గ్రామాల పరిధిలో బోర్లు, బావులు, ఎత్తిపోతల పథకాలు మరియు సాగర్ ఆయకట్టు కింద సాధారణంగా 20 వేల ఎకరాలకు పైగా వరి సాగవుతుంటుంది. కానీ ప్రస్తుత నీటి ఎద్దడి వల్ల వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే ప్రమాదం కనిపిస్తోంది. మరో 10 రోజుల్లో వరి నాట్లు ముమ్మరం కావాల్సి ఉండగా, దుక్కులు తడవడానికి కూడా నీరు లేదు. చెరువుల కింద నీటి ఆధారం ఉన్న కొద్దిపాటి మాగాణి భూముల్లో తప్ప, మిగిలిన చోట్ల కనీసం వరి నారుమళ్లు కూడా చల్లుకోలేదు. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో ఆయకట్టుకు నీరు ఎప్పుడు వస్తుందో తెలియని అగమ్యగోచర స్థితి నెలకొంది.

### పశు సంపదపైనా కరువు దెబ్బ

వర్షాభావ పరిస్థితుల ప్రభావం కేవలం పంటలపైనే కాకుండా పశుసంపదపైనా పడింది. మైదానాలు, బయళ్లలో పచ్చిక పూర్తిగా ఎండిపోవడంతో పశుగ్రాసం (మేత) కొరత తీవ్రంగా మొదలైంది. పశువులకు కడుపునిండా మేత అందించడం రైతులకు అదనపు భారంగా మారుతోంది. గ్రామాల్లో తాగునీటి సమస్య కూడా క్రమంగా తలెత్తుతోంది.

### కలవరపెడుతున్న ఐఎండీ హెచ్చరికలు

రాబోయే ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎల్ నినో ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) చేసిన హెచ్చరికలు అన్నదాతలను మరింత కలవరానికి గురిచేస్తున్నాయి. పెట్టుబడులు పెరిగి, వర్షాలు కురవక, కరువు ముంచుకొస్తున్నా.. ఏదో ఒక సమయంలో కాలం కలిసి రాకపోతుందా అనే ఆశతోనే రైతు ప్రకృతి నిరాశను మౌనంగా భరిస్తూ ఆకాశం వైపు చూస్తున్నాడు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మండలంలో కరువు పరిస్థితులపై సమీక్ష జరపాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

# గంజాయి పట్టివేత

**- ఒక స్కార్పియోతో పాటు రెండు బైకులు**
**- రూ. 8 లక్షల విలువైన గంజాయి**



**ప్రజాపక్షం/పాల్వంచ :** గంజాయి విక్రయించినా, తాగినా నేరమని వారిపై కఠిన చర్యలు ఉంటాయని, యువత మత్తు పథార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను ఆగం చేసుకోవద్దని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటి కమీషనర్ వి. సోమిరెడ్డి అన్నారు. పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌లో సోమవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సిహెచ్ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి మండల పరిధి రంగాపురం సమీపంలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం రహదారి నుండి పాల్వంచ వైపునకు అతి వేగంగా వస్తున్న ఓ స్కార్పియో వాహనం అనుమానాస్పదంగా కనిపించినది. వెంటనే నిలిపివేసి వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్లు తెలుసుకొన్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేయగా ఒరిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరికి చెందిన బినయ సర్కార్ తన వాహనంలో మల్కాన్‌గిరి నుండి మహారాష్ట్రకు తరిస్తున్నాడని తెలిసింది. కాగా భద్రాచలం రోడ్ నుండి పాల్వంచ వైపుకు వస్తున్న రెండు బైక్‌లను ఆపి తనిఖీ చేయగా హీరో స్ప్లెండర్ ప్లస్ బైక్ పై వస్తున్న వారి వద్ద నుండి 6.200 కిలోలు, మరో బైక్ హీరో గ్లామర్ బైక్ డ్రైవర్ వద్ద నుండి 6.300 కిలో గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. ఇద్దరిని విచారించారు. ములకలపల్లికి చెందిన నూపా రవికిరణ్, తాళ్ళ ధనరాజ్‌లు, భద్రాచలానికి చెందిన వేల్పుల భరత్, ములకలపల్లికి చెందిన గద్దల శశాంక్‌లు మల్కాన్‌గిరి నుండి కొత్తగూడెం జిల్లాకు తరలిస్తున్నారని తెలిసింది. వీరిలో తాళ్ళ ధనరాజ్, గద్దల శశాంక్‌లు పారిపోయారు. మూడు వాహనాల నుండి మొత్తం 40 కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొన్నామని వీటి విలువ సుమారు 23, 60,000/లు ఉంటుందన్నారు. తదుపరి విచారణ కోసం పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌లో ముద్దాయిలను అప్పగించామని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏదైనా గంజాయి, మత్తు పథార్థాలకు సంభందించిన వివరాలను 18004252523 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ ఆర్. కిషన్, కొత్తగూడెం ఎక్సైజ్ సూపరిండెంట్ ఏ. శ్రీనివాసరెడ్డి, పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్ సిఐ ఎం. ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుల్స్ రమేష్‌బాబు, రాజు, ప్రసన్న కుమార్, తిరుపతి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సును ఢీ కొట్టిన టాటా ఏస్

**డ్రైవర్‌కు తీవ్ర గాయాలు**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా సోమవారం మధ్యాహ్నం సమయంలో సత్తుపల్లి ఆర్టీసీ డిపో బస్సు ప్రయాణికులతో ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ను వెనుక నుంచి ఢీకొనడంతో ఆర్టీసీ బస్సులో ఉన్న ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. టాటా ఏసీ డ్రైవర్ కు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు. ఈ సంఘటన స్థలాన్ని సత్తుపల్లి నుంచి కల్లూరు వస్తున్న ఏసీపీ వసుంధర యాదవ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. టాటా ఏసీ డ్రైవర్ చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామంగా తురక లక్ష్మణరావు గా గుర్తించారు. ఈ విషయమై కేసు నమోదు కావాల్సి ఉంది.

# ఖమ్మంలో బడ్జెట్ స్కూళ్లకు గడ్డుకాలం..!

**- ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రుల మొగ్గు**
**- అడ్మిషన్ల కోసం ప్రైవేట్ పాఠశాలల పోటీ**

**ప్రజాపక్షం/తల్లాడ :** ఖమ్మం జిల్లాలో 202627 విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి విద్యారంగంలో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఆంగ్ల మాధ్యమం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూపదుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు పెరిగిందని చెప్తుండటంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలవైపు ఆకర్షితులు అవుతున్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ఫీజులతో విద్య అందిస్తున్న బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్లు తగ్గి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నాయి. కొన్ని కార్పోరేట్ స్కూల్ వసతులు అధికంగా చూపించు తల్లిదండ్రులను అకట్టుకుంటున్నారు. ఖమ్మం జిల్లా అధికారిక గణాంకాల ప్రకారం జిల్లాలో సుమారు 243 ప్రభుత్వ హైస్కూళ్లు, 195 ప్రభుత్వ పాథమికోన్నత పాఠశాలలు, 835 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలున్నాయి. అదే సమయంలో 194 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, 93 ప్రైవేట్ ప్రాథమికోన్నత, 39 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అదనంగా కేజీబీవీలు, మోడల్‌స్కూళ్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు కూడా జిల్లాలో విద్యాసేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రస్తుతం దాదాపు 80వేల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నట్లు జిల్లా విద్యాశాఖ సమాచారం చెబుతోంది. ఈ ఏడాది అడ్మిషన్ల సమయంలో ప్రైవేట్ పాఠశాలల్లో చేరిస్తే ప్రభుత్వ పథకాలు రద్దవుతాయి అనే వదంతులు కొన్ని ప్రాంతాల్లో వినిపించాయని పాఠశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. అలాంటి ప్రచారాలపై అధికారిక ధృవీకరణ లేకపోయినా అవి తల్లిదండ్రుల నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయని నిర్వాహకులు అంటున్నారు. బడ్జెట్ స్కూళ్లు నెలకు అందుబాటు ఫీజులతో విద్య అందిస్తూ, ఆంగ్ల మాధ్యమం, కంప్యూటర్ విద్య, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉపాధ్యాయుల జీతాలు, భవన అద్దెలు, విద్యుత్ బిల్లులు, నిర్వహణ ఖర్చులు



భరించడం కష్టమవుతోందని యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇటీవలి పదోతరగతి ఫలితాల్లో ఖమ్మం జిల్లా ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలు నమోదు చేయడంతో ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని విద్యానిపుణులు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో ప్రైవేట్ పాఠశాలలు కూడా 100శాతం ఉత్తీర్ణత సాధించి తమ నాణ్యతను నిరూపించాయి.విద్యావేత్తల అభిప్రాయం ప్రకారం ప్రభుత్వ , ప్రైవేట్ విద్యాసంస్థలు రెండూ సమాజానికి అవసరం. ప్రభుత్వ పాఠశాలలు సామాన్య ప్రజలకు అందుబాటులో నాణ్యమైన విద్య అందిస్తే, బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ విద్యా అవకాశాలను కల్పిస్తున్నాయి. అసత్య ప్రచారాలు నమ్మకుండా ప్రతీ పాఠశాల విద్య నాణ్యత, ఉపాధ్యాయుల బోధన, గత ఫలితాలు, విద్యార్థుల అభివృద్ధి వంటి అంశాలను పరిశీలించి తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### జిల్లా విద్యా గణాంకాలు( అధికారిక సమాచారం)

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 835, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు195, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 243, ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలు 39, ప్రైవేట్ ప్రాథమికోన్నత పాఠశాలలు 93, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు194, మధ్యాహ్న భోజన పథకం అబ్ధిదారులు సుమారు 79,976 మంది విద్యార్థులు.

## ఏఐటీయూసీ పోరాట ఫలితం.. రామవరం సింగరేణి డిస్పెన్సరీ పునఃప్రారంభం

**- వైద్యుడితోపాటు పూర్తిస్థాయి సిబ్బందిని వెంటనే నియమించాలని ఏఐటీయూసీ డిమాండ్**

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) చేపట్టిన నిరంతర పోరాటానికి ఫలితంగా రామవరం సింగరేణి డిస్పెన్సరీ సోమవారం పునఃప్రారంభమైంది. డైరెక్టర్ (పర్సనల్ అండ్ ప్లానింగ్) కే.వెంటేశ్వర్లు, ఏరియా జనరల్ మేనేజర్, ప్రధాన ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి (సీఎంఓ) డా॥ కిరణ్ రాజ్ ఆధ్వర్యంలో డిస్పెన్సరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ మాట్లాడుతూ రామవరం డిస్పెన్సరీని యథానిధిగా కొనసాగించడంతోపాటు పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించాలని కోరుతూ ఈ ఏడాది మే 31న సీఎంఓ డా॥ కిరణ్ రాజ్, ఏరియా జీఎం షాలెం రాజుకు వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఏఐటీయూసీ చేసిన నిరంతర కృషి, యాజమాన్యంపై తీసుకొచ్చిన ఒత్తిడి వల్లే డిస్పెన్సరీ తిరిగి ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక నర్సు, ఒక వార్డ్ బాయ్‌ను నియమించి, రక్తపోటు, మధుమేహ పరీక్షలతోపాటు సాధారణ మందులు అందుబాటులో ఉంచి సేవలు ప్రారంభినట్లు తెలిపారు. రామవరం ప్రాంతంలోని సింగరేణి కార్మికులు, మాజీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కాంట్రాక్టు కార్మికులకు ఈ డిస్పెన్సరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అయితే డిస్పెన్సరీ ప్రారంభించడం మాత్రమే సరిపోదని, వెంటనే శాశ్వత వైద్యుడిని నియమించి అవసరమైన వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని, తగిన మందుల నిల్వలు అందుబాటులో ఉంచి నాణ్యమైన వైద్య సేవలు అందిచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన డైరెక్టర్ (పీపీ) కే.వెంకటేశ్వర్లు త్వరలోనే వైద్యుడితోపాటు అవసరమైన సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు. అలాగే డిస్పెన్సరీ నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ భవనాన్ని ఏర్పాటు చేసి పునఃప్రారంభానికి సహకరించిన ఏరియా జనరల్ మేనేజర్, ప్రధాన ఆసుపత్రి సీఎంఓను ఏఐటీయూసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఉపాధ్యక్షుడు కత్తెర్ల రాములు, నాయకులు హుమాయూన్, మండల రాజేశ్వరరావు, మల్లికార్జున్, అప్పారావు, సీపీఐ నాయకులు కంచర్ల జమలయ్య, కార్పోరేటర్ శంకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వీబీఎస్ఏ బిల్లుతో విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర

**ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** స్థానిక జూలూరుపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద (వీబీఎస్ఏ) వికాస్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు 2025 ను పూర్తిగా వ్యతిరేకిస్తు కళ్ళకు నల్ల రిబ్బన్లు ఫ్లకాట్లు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ మాట్లాడుతూ (వీబీఎస్ఏ) వికాసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు 2025 ను ఈ బిల్లు పూర్తిగా రాజ్యాంగ పరిమితులను ఉల్లంఘిస్తూ సమాఖ్య విధానాన్ని బలహీన పరుస్తుందని సంస్థగత స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తుందని ఉన్నత విద్య యొక్క ప్రమాణాలను ప్రజాస్వామ్య సమగ్ర స్వభావాన్ని ముప్పులోకి నెట్టేస్తుందని కేంద్ర ప్రభుత్వం విద్యార్థి సంఘాలను మేధావులను ప్రొఫెసర్లను ఉపాధ్యాయులను ప్రజాస్వామ్యా బద్ధంగా సంప్రదింపులు జరపాలని, రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా ఉండాలని బిల్లును పరిశీలించి అందులో ఉన్నటువంటి లోపాలను (వీబీఎస్ఏ) బిల్లులో ఉన్నటువంటి అసమాన తలను గుర్తించి అట్టి బిల్లును వ్యతిరేకించాలని



రాష్ట్రంలోని ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి దేశంలో ఉన్నటువంటి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రులు ఎంపీలను (వీబీఎస్ఏ) బిల్లును వ్యతిరేకించాలని తద్వారా విశ్వవిద్యాలయాల్లో మంచి వనరులు ఉన్న సంస్థల కి ప్రయోజనం చేకూరుతుందని వెనకబడిన ప్రాంతాలకు చిన్న కాలేజీలు ప్రతికూలంగా మారుతుందని వంశీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పసుపులేటి పవన్, అనిల్ కుమార్, బాలాజీ, రితికేష్, రామ్ చరణ్, అనిల్ కుమార్, రిషి జస్వంత్, విశాల్ శ్రీరామ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. ఐడిఓసిలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ఆయన జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన ప్రజల నుండి పలురకాల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన వినతులను ఆయా శాఖల అధికారులకు బట్వాడా చేశారు. ప్రతీ వినతిని సకాలంలో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని పరిష్కారానికి సాధ్యం కానివాటిపై సవివరంగా నివేదికలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ, పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక గ్రామ పంచాయితీ 4వ వార్డులో ఉన్న పాత తాగునీటి బావిని పూడ్చివేసి, ఆ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)ఏర్పాటు చేయాలని స్థానికులు సర్పంచ్, ఐటీసీ పీఎస్‌పీడీ యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. సుమారు 45ఏళ్ల క్రితం ఐటీసీ పీఎస్‌పీడీ నిర్మించిన బావి ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీంతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వినతిలో పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బావిని పూడ్చివేసి ఆ స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దమ్మపేట నూతన తహసీల్దార్‌గా మురళి



**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట నూతన తహసీల్దార్‌గా మద్దినేని మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అండర్ ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఆయనను డిప్యూటేషన్‌పై దమ్మపేట తహసీల్దార్‌గా ప్రభుత్వం నియమించింది. గత తహసీల్దార్ కె రామ్ నరేష్ సస్పెన్షన్ అనంతరం ఈ నియామకం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యాలయ సిబ్బంది మద్దినేని మురళికి పుష్పగుచ్చాలు అందించి ఘనంగా స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** మారుమూల ప్రాంతాల విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధే లక్ష్యం టీం సంభవ ఫౌండేషన్ సోమవారం సీజీ సరిహద్దు గ్రామాలైన కొండివాయి, ముల్కనపల్లితో పాటు దుమ్ముగూడెం మండలంలోని మరో ప్రాథమిక పాఠశాలలో మొత్తం 110 మంది విద్యార్థులకు బ్యాగులు, జ్యామెట్రీ బాక్సులు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేసింది. ఏజెన్సీ ప్రాంతంలోని పేద విద్యార్థులకు చేయూత అందించడం అభినందనీయమని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఫౌండేషన్ సభ్యులను ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ఫౌండేషన్ వాలంటీర్లు పురుషోత్తం. పృథ్వీ, మధు, సాయితేజ, మౌనిక, అశ్విని, సవిడిబోయిన శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## బినామీ పేరుతో విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**-ప్రజావాణిలో ఫిర్యాదు, తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన**



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం తహసీల్దార్ కార్యాలయంలో బినామీ పేరుతో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రైతులు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించి, అనంతరం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేసి, సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో మాలోత్ కిషోర్, పార్టీ రమేష్, పాటి రంగయ్య, మాలోత్ స్వామి, పోతుల సత్యమయ్య, పోతుల వెంకటేశ్వర్లు, బానోత్ భాషా, కొండం వెంకటేశ్వర్లు, పాటి రామయ్య, తదితర రైతులు పాల్గొన్నారు.

## వెంగళరావు నగర్‌లో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని వెంగళరావు నగర్ 10వ వార్డులో నూతన సిమెంట్ రహదారి నిర్మాణ పనులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం అదే వార్డులో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, 10వ వార్డు కౌన్సిలర్ మట్టా దేవజ్యోతి, మున్సిపల్ కమిషనర్, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

**అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జారె**



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ జూపల్లి రమేష్‌బాబుతో కలిసి క్రీడా మైదానాన్ని, పట్టణంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ముందుగా క్రీడా మైదానాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడ మౌలిక సదుపాయాలు, క్రీడాకారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అభివృద్ధి చేయాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. యువతకు నాణ్యమైన క్రీడా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని సూచించారు. అథ్లెటిక్స్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడలకు అనువుగా మైదానాన్ని తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అశ్వారావుపేట పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించి పనులు నాణ్యతతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు, కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న లైటింగ్ వ్యవస్థ ప్రజలకు భద్రతను కల్పించడంతో పాటు పట్టణానికి మరింత అందాన్ని తీసుకు వస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ అశ్వారావుపేటను అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడంతో పాటు యువతకు క్రీడల్లో ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి పనిని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. అశ్వారావుపేటకు కొత్త రూపు రానుందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో మున్సిపాలిటీ పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కోలా లక్ష్మీ నారాయణ, మిండా హరిబాబు, జీనుగు రవీంద్ర, నాయకులు జూపల్లి ప్రమోద్, వెలుపుల సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విక్రమ్-1 విజయగాథలో మాధాపురం యువ ఇంజినీర్ నరేందర్‌రెడ్డి కీలకపాత్ర




**ప్రజాపక్షం/ముదిగొండ:** ఖమ్మం జిల్లా ముదిగొండ మండల మాధాపురం గ్రామానికి చెందిన యువ ఇంజినీర్ మోర్తాల నరేందర్ రెడ్డి భారత అంతరిక్ష రంగంలో తన ప్రతిభతో జిల్లాకు మరోసారి గర్వకారణంగా నిలిచాడు. భారత అంతరిక్ష పరిశోధనలో ప్రైవేట్ రంగానికి కొత్త అధ్యాయాన్ని తెరిచిన విక్రమ్1 రాకెట్ విజయవంతమైన ప్రయోగంలో కీలక బృంద సభ్యుడిగా పనిచేసి విశేష గుర్తింపు పొందారు. రైతుకుటుంబంలో జన్మించిన నరేందర్ రెడ్డి తండ్రి మోర్తాల హనుమిరెడ్డి, తల్లి లక్ష్మీ, సతీమణి వెంకట దివ్య. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, అంకితభావంతో ఆయన అంతరిక్ష రంగంలో ఉన్నతస్థాయికి చేరుకున్నారు. ప్రస్తుతం స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థలో టీం లీడ్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విజయవంతంగా నిర్వహించిన విక్రమ్1 ప్రయోగంలో రాకెట్ ఇంటిగ్రేషన్, వివిధ సాంకేతిక పరీక్షలు, ప్రయోగానికి సంబంధించిన కీలక ప్రక్రియల్లో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించి మిషన్ విజయానికి విశేషంగా తోడ్పడ్డారు. పదేళ్లకు పైగా అంతరిక్ష, రక్షణ రంగాల్లో అనుభవం కలిగిన నరేందర్ రెడ్డికి లాంచ్ వెహికిల్ ఇంటిగ్రేషన్, లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్, టెస్టింగ్, లాంచ్ ఆపరేషన్స్ వంటి విభాగాల్లో విశేష నైపుణ్యం ఉంది. భారత అంతరిక్ష రంగ అభివృద్ధిలో తనవంతు సేవలందించడం గర్వంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముదిగొండ మండలంలోని ఓ సాధారణ రైతు కుటుంబం నుంచి అంతరిక్ష రంగంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ దేశ సేవలో భాగస్వామి కావడం ఖమ్మం జిల్లాకు గర్వకారణమని స్థానికులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ నరేందర్ రెడ్డిని అభినందించారు.

# వర్షాభావ పరిస్థితులతో రైతుల్లో ఆందోళన

- నాటిన పత్తి పంటను బతికించుకునేందుకు తంటాలు
- అడపాదడపా వర్షాలతో ఖరీఫ్ సాగుపై అనిశ్చితి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** వర్షాభావ పరిస్థితులు కొనసాగుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశాజనకంగా పత్తి, మిర్చి తదితర పంటలను సాగు చేసిన రైతులు ప్రసుత్తం వర్షాలు లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నాటిన పత్తి మొక్కలు ఎండిపోకుండా కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలు కూడా అన్ని ప్రాంతాల్లో కాకుండా కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడంతో పంటలకు తగినంత తేమ అందడంలేదు. దీంతో పంటల పెరుగుదల మందగించి ఇప్పటికే రైతుల విత్తనాల కోసం దుక్కిదున్నడం కోసం వేల రూపాయలు ఖర్చు చేశారు. దిగుబడులపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు పూర్తిస్థాయిలో సాధ్యమవుతుందా అనే సందేహాలు రైతుల్లో వ్యవమవుతున్నాయి. వర్షాభావం కొనసాగితే పెట్టుబడ్డులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులు తొందరపడి అదనపు విత్తనాలు వేయకుండా వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అవసరమైన వ్యవసాయ సలహాలను పాటించాలని సూచిస్తున్నారు. సోమవారం పలు గ్రామాల్లో తేలికపాటి వర్షాలు పడటం పత్తి రైతులకు ఊరటను కలిగించింది. అధిక వర్షం పడ్డ ప్రాంతాల్లో రైతులు యూరియాను వేసేందుకు సిద్ధమవుతున్నారు. రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురవాలని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

# కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాద బాధితులకు ఇన్సూరెన్స్ ఇవ్వాలి

**డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క జోక్యం చేసుకోవాలి : రైతు సంఘం నాయకులు**



**ప్రజాపక్షం/మధిర :** సాయి బాలాజి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన మిర్చి రైతులకు 100% ఇన్సూరెన్స్ పరిహారం వెంటనే అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మధిర తహశీల్దార్ కార్యాలయం ముందు కోల్డ్ స్టోరేజ్ మిర్చి బాధిత రైతులు ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదం జరిగి మూడు నెలలు గడుస్తున్నా బాధిత రైతులకు ఎలాంటి నష్టపరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపద్యంలో పెట్టుబడులకు నిధులు లేక పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, అప్పుల చెల్లింపుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితి దృష్టిలో ఉంచుకొని స్థానిక డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఇన్సూరెన్స్ కంపెనీలతో చర్చించి బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు, జిల్లా కార్యదర్శి మాదినేని రమేష్, కన్వీనర్ దివెల్ల వీరయ్య, సీతారాంరెడ్డి, నాయకులు మడిపల్లి గోపాలరావు, మందడపు ఉపేంద్ర, పడకంటి మురళి, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం





**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** నీట్ పరీక్ష పేపర్ లీకేజికి కారుకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్‌వాంగ్‌చుక్ దీక్షను భగ్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ సోమవారం అశ్వారావుపేటలోని పాత ఎంపిడిఓ కార్యాలయం రింగ్ రోడ్డు సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గోకినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, ప్రశ్నా పత్రాల లీకేజికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే లీకేజి కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతిపౌరుడికి రాజ్యాంగం కల్పించిందని, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు నిర్భందించి దీక్షను భగ్నం చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు. ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం నిరసనలను అణచివేయడం కాకుండా బాధ్యతయుతంగా స్పందించాలని ఆయన కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం చూపే వరకు సోనమ్ వాంగ్‌చుక్‌కు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కంగాల కల్లయ్య మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, కోయ రంగాపురం సర్పంచ్ సోడెం చిన్నగంగమ్మ, పార్టీ నాయకులు సోడెం ముత్యాలు, కంగాల గోవిందు, ధర్మల రాములు, కారం ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి

**- ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు**

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలం ఉసిర్లగూడెం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాతమామిళ్ళవారి గూడెం శివారులో కోర్స సంతోష్ అనే యువకుడు మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఫిర్యాదుతో అశ్వారావుపేట పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు.

# బంగారపు షాపులో చోరీ



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలకేంద్రంలోని స్థానిక జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న చేతన్ జూవెలరీ షాపులో సోమవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో చోరీ జరిగింది. జ్యువెలరీ షాప్ యజమాని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... జూలూరుపాడు మండలం వెంగన్న పాలెం గ్రామానికి చెందిన రవి గత కొంతకాలంగా జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న షాపునందు నగల వ్యాపారం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం బంగారపు షాపు వద్దకు వొచ్చి బంగారం కొనుగోలు చేసి ఫేక్ ఫోన్ పే చేసి షాపు నుండి పరారయ్యాడు. షాపు యజమాని ఫోన్ పే చెక్ చేసుకుని డబ్బులు రాలేదని యజమాని దొంగను పిలుస్తున్నా పలకకుండా పారిపోయాడు. చోరికి గురైన బంగారం విలువ విలువ 7 గ్రాములు లక్ష 5 వేల రూపాయలు. షాప్ యజమాని దొంగ తనం జరిగిన వెంటనే సీసీ పుటేజ్ లోని వీడియోలు షోషల్ మీడియాలో పోస్ట్ చేసి దొంగను పట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వర్షపు నీటి సంరక్షణపై అవగాహన



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన ప్రాంతీయ సంచాలకులు(సిడిఎంఎ) ఆదేశాల మేరకు జల్‌శక్తి అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న జల్ సంచయ్ జన భాగీదారి 3.0 ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం వైరా మున్సిపాలిటీ 3వ వార్డులో వార్డు కౌన్సిలర్, మాజీ జెడ్పిటిసి బొర్రా ఉమాదేవి ఆధ్వర్యంలో వర్షపు నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షపు నీటి నిల్వ గుంతలను పరిశీలించి, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాల పునరుద్ధరణ, సుస్థిల జల నిర్వహణ అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బొర్రా ఉమాదేవి మాట్లాడుతూ నీటిని పొదుపుగా వినియోగిస్తూ భవిష్యత్ తరాలకు జల వనరులను కాపాడేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మేడూరి రామచంద్రరావు, టిపిబివో మల్లేష్, మున్సిపల్ మేనేజర్ సుధీర్, మెప్మా టిఎంసి బండారుపల్లి వెంకటేశ్వర్లు, మెప్మా ఆర్‌పి రమాదేవి, వార్డు ప్రజలు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌లోనే భార్యపై కత్తితో దాడి




**-తీవ్రంగా గాయపడిన మహిళ**
**-ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు**
**-కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

**ప్రజాపక్షం/ఏన్కూరు :** ఖమ్మం జిల్లా ఏన్కూరు పోలీస్ స్టేషన్‌లోనే ఓ భర్త తన భార్యపై కత్తితో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన ఈ ఘటనతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తీవ్రంగా గాయపడిన మహిళలను పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఏన్కూరు ఎస్ఐ సంధ్య తెలిసిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఎర్రబోడు తండాకు చెందిన భూక్య రాంబాబు, తన భార్య రజినిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ విభేదాలు కొనసాగుతుండటంతో రజిని తన పుట్టింటైన సాతాని గూడెం గ్రామంలో నివసిస్తోంది. ఈ క్రమంలో గ్రామ సంఘం ద్వారా తీసుకున్న రుణం చెల్లించాలని సంఘ సభ్యులు కోరడంతో రజినిని ఏన్కూరులోని భారతీయ స్టేట్ బ్యాంకుకు తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రాంబాబు అక్కడికి చేరుకుని భార్యతో వాగ్వాదానికి దిగాడు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బ్యాంకు ఫీల్డ్ అధికారి అత్యవసర సేవలకు సమాచారం ఇవ్వగా, పోలీసులు అక్కడికి చేరుకుని రజినిని భద్రత నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే భార్యను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన విషయం తెలుసుకున్న రాంబాబు కొద్ది సేపటికే అక్కడికి చేరుకుని తన వెంట తెచ్చుకున్న కత్తితో రజినిపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె ఎడమ భుజం, ఎడమ చేతి మణికట్టు వద్ద తీవ్ర గాయాలయ్యాయి. అధిక రక్తస్రావం కావడంతో అక్కడే ఉన్న పోలీసులు, స్థానికులు వెంటనే స్పందించి ఆమెను ఏన్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ సంధ్య తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ వివాదాలే దాడికి కారణమా,లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లో ఈ దాడి జరగడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజలు, ప్రత్యక్ష సాక్షులు ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ జూ.కళాశాలల సమస్యలు పరిష్కరించాలి

**- మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి**
**- అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అడిమాండ్ చేశారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అధ్యాపకులు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ప్ర.జూ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాల్సిన పాలకులు ఆ దిశగా అడుగులు వేయడం లేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్మెంట్లు వెంటనే విడుదల చేసి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. విద్యార్థులు చదువులతో పాటు విద్యా రంగ సమస్యలపై పోరాటాలు చేయాలని, ఎల్లప్పుడూ శాస్త్రీయ



విద్యావిధానానికి దోహదపడాలని సూచించారు.

**కళాశాల నూతన కమిటీ ఎన్నిక :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏఐఎస్ఎఫ్ నూతన సమితి ఏకగ్రీవంగా ఎంపికైంది. అధ్యక్షులుగా షేక్ ఇస్మాయేల్, కార్యదర్శిగా బి నిఖిల్‌తో పాటు 23 మందితో కమిటీని నియమించారు.

# ప్రజలు ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలి

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందనే నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు మరింత అప్రమత్తంగా ఉండి, ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చూడాలని ఎమ్మెల్యే నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ఓ ప్రకటన విడుదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతి అర్హులైన ఓటరు తప్పనిసరిగా పాల్గొని తమ ఓటరు వివరాలను ధృవీకరించడంతో పాటు అవసరమైన సవరణలను పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అత్యంత విలువైనదని, ఎలాంటి కారణంతోనైనా అర్హులైన ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏలు), ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ, బూత్ స్థాయి నాయకులు ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హుడి ఓటు నమోదు, ధృవీకరణ, సవరణ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందనే నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు మరింత అప్రమత్తంగా ఉండి, ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చూడాలన్నారు. ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, ఒక్క ఓటు కూడా మిస్ కాకూడదు అనే లక్ష్యంతో పనిచేసి ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని డా.మట్టా రాగమయి దయానంద్ కోరారు.

# పిల్లల్లో నులిపురుగుల నిర్మూలనకు మోప్ అప్ డ్రైవ్

**-డిఎంహెచ్ఓ డాక్టర్ డి రామారావు**

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం(ఎన్‌డిడి) మోప్ అప్ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరంలోని పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు సోమవారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రస్తోగినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఎన్ఎస్‌సి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించిన డిఎంహెచ్ఓ, ప్రధాన విడతలో వివిధ కారణాలతో మాత్రలు తీసుకోలేకపోయిన విద్యార్థులకు మోప్ అప్‌డే సందర్భంగా ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది సమక్షంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల కడుపులోని నులిపురుగులు ఆహారంలోని పోషకాలను హరించి రక్తహీనత, పోషకాహార లోపానికి



కారణమవుతాయని తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని చెప్పారు. జిల్లాలో ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి బాలబాలికలకు మాత్రలు అందించేందుకు వైద్య, విద్యాశాఖలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. బడి బయట ఉన్న పిల్లలను కూడా గుర్తించి కవర్ చేస్తున్నామని తెలిపారు. మాత్రలు నమిలి మింగేలా చూడాలని, ఖాళీ కడుపుతో కాకుండా అల్పాహారం లేదా భోజనం చేసిన తర్వాతే వేయించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పట్టణ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆకతాయిల హల్‌చల్

**- వ్యక్తిని కత్తితో పొడిచి పారిపోయిన వైనం**
**- ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలంలో ఆకతాయిల రాత్రివేళల్లో హల్ ఛల్ చేస్తున్నారు. డబ్బులు కోసం బెదిరింపులకు పాల్పడుతూ ఇవ్వకుంటే కత్తులతో పొడిచి పారిపోతున్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ముందు శనివారం అర్ధరాత్రి ఓ వ్యక్తి ఇంటికి వెళుతుండగా అటుగా వచ్చిన ఆకతాయులు ఆ యువకున్ని ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు లేవంటూ ఆయన చెప్పడంతో ఇస్తావా ఇవ్వవంటూ ముందు పిడిగుద్దులు గుద్ది వారి ఆవేశం ఆగక చేతిలో ఉన్న కత్తితో వీపుపై విచక్షణా రహితంగా పొడిచి అక్కడి నుండి ఎంపిడిఓ కార్యాలయం గేటు నుండి లోపలివైపు పరారయ్యారు. ఈలోగా అటుగా వస్తున్న పోలీసులు గాయాలపాలైన వ్యక్తిని గమనించి విషయం తెలుసుకుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్చి చికిత్సలు అందిస్తున్నారు. ఈ విషయంపై వారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి వేళ యువకులు గంజాయి, మద్యం వంటివి సేవిచి డబ్బుల కోసం దాడులకు పాల్పడుతున్నారు. దీంతో రాత్రివేళల్లో రోడ్లపై తిరిగేందుకు ప్రజలు జంకుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో భయటకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి నెలకొంది.

# సింగరేణి ఉచిత విద్యా శిక్షణ



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియా పి.వి. కాలనీ నందు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు, నిరుద్యోగ యువతీ యువకులకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ డిటిపి, మగ్గం వర్క్స్, క్లాత్/ జ్యూట్ /బంజారా బ్యాగ్స్, ఫోటో షాప్, మల్టీ మీడియా కొర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించినట్లు ఏజిఎం (పర్సనల్) ఎస్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి యాజమాన్యం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా నందు మహిళలకు, నిరుద్యోగ యువతి యువకులకు అనుభవజ్ఞులైన అధ్యాపకుల ఆధ్వర్యంలో ప్రస్తుతం ఎంతో డిమాండ్ లో ఉన్న టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ డిటిపి, మగ్గం వర్క్స్, క్లాత్/ జ్యూట్ /బంజారా బ్యాగ్స్ తయారీ, ఫోటో షాప్, మల్టీ మీడియా కోర్సులలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఈ శిక్షణ ఇచ్చుటకై యాజమాన్యం నిర్ణయించడం జరిగింది అని తెలిపారు. శిక్షణ పూర్తి చేసి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ హైదరాబాద్ వారిచే సర్టిఫికెట్లు కూడా అందజేయబడుతాయి అన్నారు. గతంలో సింగరేణి సేవ సమితి ద్వారా పొందిన అభ్యర్థులు సొంతంగా యూనిట్లు పెట్టి తాము ఉపాధి పొందడమే కాక సాటి వారికి జీవనోపాధి కల్పించే స్థాయికి ఎదిగారని, కాబట్టి ఆసక్తిగల సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులు, మాజీ సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులు, నిరుద్యోగ మహిళలు, యువతులు, యువకులు, అలాగే స్థానిక మరియు పరిసర ప్రాంతాలకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తుకు ఒక పాస్పోర్ట్ సైజు ఫోటో జతచేసి ఈ నెల 30వ తేదీ లోపు మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం పర్సనల్ విభాగంలో అందజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోగలరని ఆయన కోరారు.

# 25న అరుణోదయ నాగన్న సంతాప సభను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ఇల్లందు:** అమరుడు అరుణోదయ నాగన్న సంతాప సభను ఈనెల 25న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ నాయకులు తెలిపారు. సభకు కవులు, కళాకారులు, కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరుతూ ఇల్లందు మండలం పోచారం, అమర్సింగ్ తండా గ్రామాల్లో వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో తుడుం శ్రీను, మాజీ సర్పంచ్ శ్రీను, ఉప సర్పంచ్ కోడి పాపయ్య, ఏఐకేఎంఎస్ అధ్యక్షుడు లక్ష్మ , పీవైఎల్ నాయకులు సురేష్, లక్ష్మ ణ్, తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లుగా ఫిజిక్స్ టీచర్ లేరు..

**-50 మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో..**
**-వెంటనే ఉపాధ్యాయుడిని నియమించాలని విజ్ఞప్తి**




**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం అనంతారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గత రెండేళ్లుగా ఫిజిక్స్ సబ్జెక్టుకు శాశ్వత ఉపాధ్యాయుడు లేకపోవడంతో పదో తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిజిక్స్ సబ్జెక్టుకు కేటాయించబడిన ఉపాధ్యాయురాలు రెండేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై పాల్వంచలోని జడ్పీహెచ్ఎస్ కేటీపీఎస్ పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి అనంతారం పాఠశాలలో ఆ పోస్టు ఖాళీగానే ఉందని విద్యార్థులు తెలిపారు.దీంతో ఫిజిక్స్ సబ్జెక్టును బోధించే ఉపాధ్యాయుడు లేక సుమారు 50 మంది విద్యార్థులు విద్యాభ్యాసంలో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతిలో ఫిజిక్స్ అత్యంత కీలకమైన సబ్జెక్టు అయినప్పటికీ, గత రెండేళ్లుగా ఎవరూ సక్రమంగా బోధించకపోవడంతో పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించగలమా అనే ఆందోళన నెలకొందని విద్యార్థులు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే అనంతారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు ఫిజిక్స్ ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని, జిల్లా విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.అధికారులు స్పందించి వెంటనే ఉపాధ్యాయుడిని నియమించి తమ విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

# పోరాటాలతోనే సమస్యల పరిష్కారం




**-ఆరు నుంచి సిపిఐ పాదయాత్రలు**
**-నగర కమిటీ సమావేశంలో దండి సురేష్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఆందోళన చేపట్టక తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ స్పష్టం చేశారు. ప్రజా పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేయాలన్నారు. సిపిఐ నగర కమిటీ సమావేశం సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. వరదా నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, పేదలకు నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంలో కొంత వివక్ష నెలకొన్నదన్నారు. రెండు దశాబ్దాలుగా పట్టణీకరణ అత్యంత వేగంగా జరిగిందని అందుకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన జరగడం లేదన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న పేదలు సరైన ఉపాధి అవకాశాలు లేక నివాస స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పట్టణ పేదలను సమీకరించి సమస్యల పరిష్కారానికి సిపిఐ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం బిపిఎల్ ద్వారా నివాస స్థలాలను ఇచ్చేందుకు నిరాకరించి ఆ జీవోను సైతం రద్దు చేసిందని పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ రెండున్నర ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఆ పని చేయలేదని సురేష్ తెలిపారు. సంక్షేమ పథకాల అమలు కూడా సరైన రీతిలో జరగడం లేదని పింఛన్ల పెంపుతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ పిలుపు మేరకు ఆగస్టు ఆరు నుంచి 15 వరకు జిల్లాలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఐదు నియోజక వర్గాల పరిధిలో పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా స్థానికంగా సమస్యలను గుర్తించి పోరాట కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, ఎస్కె సైదా, జాకీర్, పి. మోహన్‌రావు, యాకూబ్ పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే..




**-బిజెపిది నియంతృత్వ విధానం : ఏఐఎస్ఎఫ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** నీట్ పేపర్ లీకేజీకి కారణమైన కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని ఏఐఎస్ఎఫ్ కేంద్ర కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులపై లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ అవినీతి, నిర్లక్ష్యం, అధికార యంత్రాంగం కుమ్మక్కు కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది కేవలం పరీక్షా వైఫల్యం కాదని మోడీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. లేని గొప్పలను ప్రభుత్వానికి అపాదించుకుని కేంద్ర ప్రభుత్వం కాలం గడుపుతుందని రామకృష్ణ ఆరోపించారు. లక్షలాది మంది ప్రజల జీవితాలతో చెలగాటమాడిన పేపర్ లీకేజీలో ఎవరు బాధ్యులుగా ఉన్నారో వారిని కఠినంగా శిక్షించాలని లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆందోళన చేయడాన్ని బిజెపి నేరంగా పరిగణించడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు లోకేష్, మనోజ్, శివనాయక్, పవన్, ప్రసాద్, కిరణ్, వెన్నెల, శ్రావ్య, సుస్మిత, శ్రీనిధి, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యకర్త సత్యనారాయణ కుటుంబానికి రూ.ఐదు లక్షలు అందజేత



**ప్రజాపక్షం/కొణిజర్ల :** టిడిపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు బక్కని నరసింహులు, టిటిడి దేవస్థానం సభ్యులు నందూరి నర్సిరెడ్డి సోమవారం మండల పరిదిలోని పెద్దమునగాల గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని తుప్పతి సత్యనారాయణ అనే తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఇటీవల కాలంలో మరణించాడు. అతనికి పార్టీ సభ్యత్వం ఉండటంతో మృతుని కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బతికున్నప్పుడు పార్టీకి అండగా నిలబడి పార్టీ అభివృద్ధికోసం పనిచేసిన సత్యనారాయణ మనమధ్య లేకపోయినా పార్టీ ఆయన కుటుంబానికి అండగా నిలబడి కుటుంబానికి ఐదులక్షల రూపాయల చెక్కును అందజేసి ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకోవడం జరిగిందని అన్నారు. మండలంలో, వైరా నియోజకవర్గంలో పార్టీ చాలా బలంగా ఉందని ఇది కార్యకర్తల పట్టుదలతోనే సాధ్యమైందని అన్నారు. టిడిపి ఓటు బ్యాంకు ఎప్పటికి చెక్కుచెదరని ధీమా వ్యక్తం చేశారు. అంనంతరం పెద్దగోపతి గ్రామంలోని వెలనాటి అప్పయ్య కుటుంబాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈకార్యక్రమంలో మాజీ ఐటిడిపి తాలికోట హరికృష్ణ, జిల్లా కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, టిడిపి కొణిజర్ల మండల అధ్యక్షుడు తాతా సుధాకర్, కృష్ణమాచారి, కట్నంస్వామి, కూరపాటి వెంకటేశ్వర్లు, కాపా కృష్ణ మోహన్, చెరుకూరి చలపతి, వనమా వాసు, వరలక్ష్మి, గుత్తా సీతయ్య, చింతల మురళీ, సవళ్ల నరసింహారావు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్న సుగణమ్మ హత్య కేసు మిస్టరీ వీడేనా..?

**- కేసును ఛేదించేందుకు పింప్రడిపోలు గ్రామాన్ని జల్లెడ పడుతున్న పోలీసులు**





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** పిండిప్రోలు గ్రామానికి చెందిన చెన్న సుగణమ్మ హత్య కేసును ఛేధించేందుకు పోలీసులు ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన ప్రతి కోణాన్ని పరిశీలిస్తూ ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి, స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గ్రామంలో అణువణువు గాలిస్తూ దర్యాప్తు చేపడుతున్నారు. సుగణమ్మ హత్య జరిగిన సంఘటన స్థలాన్ని పరిసరాలను మరోసారి పరిశీలించడంతో పాటు సిసి కెమెరా దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలను విశ్లేషిస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి గ్రామంలో బెల్ట్ షాపు యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తరచూ బెల్ట్‌షాపుల వద్ద మద్యం సేవించే వారి వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే నివాసం ఉంటున్న వారు వివరాలను, గ్రామం నుంచి బయట ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి వివరాలను పరిశీలిస్తున్నారు. గతంలో జరిగిన దొంగతనాలకు ఇప్పుడు జరిగిన సుగణమ్మ హత్యకు సంబంధించిన ఆధారాలను పరిశీలిస్తున్నారు. గతంలో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులే సుగణమ్మను అతికిరాతకంగా బంగారు ఆభరణాల కోసం హత్య చేసి ఉంటారా అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు. చెన్న సుగణమ్మ హత్య కేసును త్వరలోనే ఛేధించి పూర్తి వివరాలను వెల్లడిస్తామని, దర్యాప్తు కీలక దశలో ఉందని, గ్రామ ప్రజలు ఎలాంటి సమాచారమైనా పోలీసులకు అందించి సహకరించాలని, ప్రజల సహకారంతో నిందితులను త్వరగా గుర్తించి చట్టం ముందు నిలబెడతామని పోలీసులు తెలిపారు. గ్రామంలో ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి హంతకుడిని చట్టం ముందు నిలబెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ దర్యాప్తులో ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి, స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్, ఎస్సైలు నాగరాజు, కాసర్ల రాజయ్య, సంతోష్, దీప్తి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హైకోర్టులో యోగా ఫిల్ విచారణకు అనుమతి

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** యోగా విద్యను కేజీ నుంచి పిజి వరకు పాఠ్యంశంగా చేర్చాలని 50వేల గౌరవ వేతనం శిక్షకులకు ఇవ్వాలని హైకోర్టులో తెలంగాణ యోగా సంఘ రాష్ట్ర అధ్యక్ష సేవక్ మరికంటి వెంకట్ ఫిల్ దాఖలు చేశారు. ఈ ఫిల్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ సందర్భంగా ఖమ్మం కోర్టులో మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, న్యాయవాదులు నర్సింహారావు, సుదర్శన్, పి. దానయ్య, క్రాంతి, శేఖర్‌బాబు, నారాయణ స్వామి, బాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించిన వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష

**ప్రజాపక్షం/ సుజాతనగర్ :** మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి కొత్తగూడెం స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రెండు రోజులు జైలు శిక్షను విధించారు. ఈ ఏడాది ఏప్రిల్ 29న నాయకన్ గూడెం వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా రవ్వా వినోద్ అనే వ్యక్తి మద్యం సేవించి ట్రాక్టర్ నడుపుతూ పట్టుబడ్డాడు. మోటార్ వాహన చట్టం ప్రకారం సుజాతనగర్ ఎస్ఐ ఎం. రమాదేవి కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన అనంతరం న్యాయమూర్తి రెండు రోజులు జైలు శిక్ష విధించాడు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపటం ప్రమాదకరమని నిబంధనలు పాటించాలన్నారు.

# వినియోగదారునికి పరిహారమివ్వండి

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** నాణ్యత లేని చెప్పులను విక్రయించినందుకు వినియోగదారునికి ఐదువేల పరిహారం చెల్లించాలని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సోమవారం తీర్పునిచ్చారు. లింగాల ప్రవీణ్ అనే వ్యక్తి ఖమ్మం కోర్టులో న్యాయవాద క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది ఆగస్టు నెలలో రూ.1599 వెచ్చించి చెప్పులు కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన కొద్ది రోజులకే చెప్పులు పాడైపోవడంతో సదరు దుకాణదారున్ని ఆశ్రయించాడు. బిల్లు చూపి వాటి స్థానంలో కొత్త చెప్పులు ఇవ్వాలని కోరినా సెట్రో షోరూం యజమాని అందుకు సమ్మతించలేదు. చివరకు న్యాయవాదులు యల్లంపల్లి నరేంద్రస్వరూప, కొల్లికొండ శరత్‌బాబు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో వాదనలు వినిపించారు. ఫిర్యాదు దారునికి ఐదువేలు చెల్లించడంతో పాటు న్యాయ ఖర్చులకు గాను మరో ఐదువేలు చెల్లించాలని తీర్పునిచ్చారు. 45 రోజుల లోపు మొత్తం పరిహారాన్ని చెల్లించాలని తీర్పునిచ్చింది.

# అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్థానిక ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలలో 2026 27 సంవత్సరానికి వివిధ సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. బిబిఏ, బిసిఏ, బిఎఫ్ఎస్ఐ, బయోటెక్నాలజీ, బిజినెస్, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్, డేటా సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, ఇంగ్లీష్, గణితం, పొలిటికల్ సైన్స్, తెలుగు సబ్జెక్టులలో ఖాళీల భర్తీ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు విద్యార్హతకు సంబంధించిన ధృవీకరణ పత్రాలతో ఈనెల 23లోపు దరఖాస్తులను సమర్పించాలని ఈనెల 25 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన తెలిపారు. పిహెచ్‌డి నెట్ సెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందని తెలిపారు.

# కలకోట నూతన విద్యుత్ సెక్షన్ ఏఈగా మోహన్



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని 12 గ్రామాల విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన కలకోట విద్యుత్ సెక్షన్‌కు అసిస్టెంట్ ఇంజనీరు(ఏఈ)గా జి మోహన్ సోమవారం బోనకల్ విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరతగతిన పరిష్కరించడం, సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా ఈ నూతన విద్యుత్ సెక్షన్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. బోనకల్ పరిధిలోని 12 గ్రామాలకు ఈ సెక్షన్ ద్వారా ప్రత్యేకంగా సేవలు అందనున్నాయి. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏఈ జి మోహన్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించి, నాణ్యమైన సేవలు అందించే దిశగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# 15వ బెటాలియన్‌లో ఘనంగా ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పోలీస్ సిబ్బంది ఉద్యోగ పరంగా ఎదుర్కొనే ఒత్తిడిని తగ్గించడంలో ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, ఈ ఆటల ద్వారా సిబ్బందిలో ఉత్సాహం, స్ఫూర్తి పెరుగుతుందన్నారు 15 బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు. సోమవారం మండల పరిధిలోని బేతుపల్లి గంగారంలో గల 15వ బెటాలియన్ లో ఘనంగా ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్ 2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెదబాబు హాజరై క్రీడా వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ కంపెనీలకు చెందిన పోలీస్ సిబ్బంది కంటింజెంట్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఉద్యోగ పరంగా ఎదుర్కొనే ఒత్తిడిని తగ్గించడం ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ ఆటల ద్వారా సిబ్బందిలో ఉత్సాహం, స్ఫూర్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌ను పోలీస్ సిబ్బంది క్రీడా స్ఫూర్తితో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఏ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ బి. వేణు గోపాల్ రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మినిస్టీరియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.